క్లుప్తంగా

చైర్మన్‌ను అరెస్టు చేయొద్దని ఉత్తర్వులు

వైరా: వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇవ్వగా.. ఆతర్వాత కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో చైర్మన్‌ను అరెస్ట్ చేయొద్దంటూ కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీ పరిధి 10వ వార్డులోని ఓవర్ హెడ్ ట్యాంకును గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారని కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సిబ్బందిని విచారించిన విషయం విదితమే.

విద్యార్థుల ప్రతిభ

మధిర: జాతీయస్థాయి పోటీ పరీక్ష అయినటువంటి ఐఎస్‌టీఎస్ఈ ఫైనల్ లెవెల్‌లో మధిర పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటి పలు అవార్డులను సాధించారు. మంగళవారం విడుదలైన ఈ పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో 3,4,5 ర్యాంకులతో పాటు 33 కన్సోలేషన్ బహుమతులు, 17 గోల్డ్ మెడల్స్, 60 ప్రశంస పత్రాలు అందుకున్నారు. దీంతో విద్యార్థులను ప్రిన్సిపల్ భారతి అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం చేతన్, జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు, డీన్ నరేష్, ఒలంపియాడ్ ఎగ్జామ్స్ ఇన్‌చార్జ్ తిరుపతిరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామ దీపికల సమ్మె



ఏపీఎం సుశీలకు సమ్మె నోటీసు అందజేస్తున్న గ్రామదీపికలు

కొణిజర్ల: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ గ్రామ దీపికల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆన్‌లైన్ పనులు నిలుపుదల చేయాలంటూ గ్రామదీపికలు సమ్మె నోటీసును మంగళవారం ఏపీఎం సుశీలకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ గ్రామ దీపికలకు కనీస వేతనం, రూ.26,000కు పెంచాలన్నారు. తమ సమస్య పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో వీఓ అధ్యక్షురాలు మాణిక్యమ్మ, వెంకటేశ్వర్లు, సునీల్, ధనలక్ష్మి, శివరాణి, సుజాత, పద్మ, అరుణ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న సొసైటీ చైర్మన్ సాంబశివరావు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం సొసైటీ సభ్యుడు రైతు సామినేని సురేష్ ఇటీవల మృతి చెందారు. ఈయన పేరిట స్థానిక సొసైటీలో గ్రూపు ఇన్సూరెన్స్ చేయించారు. దీంతో మృతుడి పేరిట మంజూరైన రూ.50 వేల నగదును ఆయన సతీమణి రాజేశ్వరికి మంగళవారం సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ మగినం వీరభద్రంలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ మహేష్, సొసైటీ సీఈఓ వీరారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

తహసీల్ ఎదుట ఆందోళన

కొణిజర్ల: తమ భూమికి హక్కులు కల్పించాలని భూ యజమానుల కుటుంబ సభ్యులు మంగళవారం తహసీల్ ఎదుట ఆందోళన చేశారు. మండలంలోని పల్లిపాడుక చెందిన కంకణాల రాదమ్మ కుటుంబ సభ్యులు మా భూమికి హైకోర్టులో అనుకూలంగా వచ్చిన తీర్పును అనుసరిస్తూ అసైన్‌మెంట్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పల్లిపాడు సర్వే నంబర్ 255–3 భూమికి సంబంధించి తమకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందని, అట్టి భూమిని అగ్ర కులాల వారు ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

ముదిగొండ: మండలంలోని అమ్మపేటకు చెందిన వివాహిత షేక్ మదార్‌బీ(38) అయ్యగారి పల్లిలోని వ్యవసాయ బావిలో పడి అనుమానస్పదస్థితిలో మృతిచెందిన విషయం విధితమే. మాదార్‌బీ మృతిపై అనుమానాలు ఉన్నాయని విచారణ జరిపి న్యాయం చేయాలని మృతురాలి సోదరి షేక్ ఉప్పలబీ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

తల్లాడ: మండలంలోని లక్ష్మీనగర్ గ్రామంలో మంగళవారం శతాధిక వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. పూల చిన్న నరసయ్య (101) అనారోగ్యంతో తన గృహంలో మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృత దేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు.

ఇంకెన్నాళ్లు..?

అసంపూర్తిగా విజయ డెయిరీ భవనం

- ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలం
- అద్దె భవనంలోనే డెయిరీ కార్యకలాపాలు
- అవస్థలు పడుతున్న సిబ్బంది



ఎర్రుపాలెంలో అసంపూర్తిగా నిలిచిన డెయిరీ భవనం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన నిర్మించిన టీఎస్ విజయ డైరీ భవనం పూర్తిగా శిథిలమైంది. పాల ఉత్పత్తుల శీతలీకరణ కోసం నిర్మించిన భవనం లక్ష్యం పూర్తిగా నిర్వీర్యమైంది. ఈ భవనం నిర్మాణానికి లక్షలాది రూపాయల విలువచేసే విలువైన ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీని నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.6 లక్షల నిధులను మంజూరు చేయగా కేంద్ర మంత్రి రేణుకా చౌదరి 2007,డిసెంబర్ 20న లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఆ నిధులతో పనులు చేపట్టిన ఇంజనీరింగ్ అధికారులు తూతూ మంత్రంగా నడిపించి మధ్యలోనే వదిలేసి చేతులు దులుపుకున్నారు. సగంలోనే ఆగిన ఆ భవనం ప్రారంభించకుండానే శిథిలమైపోతుంది. దాదాపు 15 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఆ భవనాన్ని చూసిన ప్రతి ఒక్కరూ అధికారులు, పాలకుల పనితీరును వెక్కిరిస్తున్నారు. పాడి పరిశ్రమపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తలచుకుంటూ అసహనం వెలుబుచ్చుతున్నారు. ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీంతో మందుబాబులకు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి నిధులు మంజూరు చేసి భవనాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అద్దె భవనంలోనే డెయిరీ కార్యకలాపాలు..

ఎర్రుపాలెం నుంచి మధిర ప్రధాన రహదారి పక్కన అద్దె భవనంలో పాల శీతలీకరణ కేంద్రం నిర్వహిస్తున్నారు. సరైన వసతులు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈ భవనం అద్దె నిమిత్తం నెలకు రూ.4 వేలు చెల్లిస్తున్నారు. సంవత్సరాల తరబడిగా అద్దెను చెల్లిస్తున్న డెయిరీ ఉన్నతాధికారులు అసంపూర్తి భవనాన్ని మాత్రం పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.



అద్దె భవనంలోని పాలశీతలీకరణ కేంద్రం

ఉన్నతాధికారులకు నివేదించాం..



అరకొర వసతులతో అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహించడం చాలా కష్టంగా ఉంది. ప్రస్తుతం 1,000 లీటర్ల పాలను శీతలీకరణ చేస్తున్నాం. ఈ భవనానికి ప్రహరీ లేకపోవడంతో జనరేటర్‌కు, ఇతరత్రా సామగ్రికి భద్రత కొరవడింది. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం.

– ఉపేంద్ర, ఇన్‌చార్జ్ మేనేజర్, ఎర్రుపాలెం

నిధులు మంజూరు చేయాలి..



మండలకేంద్రంలోని డెయిరీ భవనాన్ని సగంలోనే వదలేయడం సరికాదు. దీనిని చూస్తేనే ఉన్నతాదికారులు, పాలకులకు పాడి పరిశ్రమపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధుల మంజూరు చేసి మిగిలిన పనులను పూర్తి చేయాలి.

– చంద్రమౌళేశ్వరరావు, రైతు, ఎర్రుపాలెం

పంట నష్టంపై అధికారులు సర్వే

బోనకల్: ఇటీవల అకాల వర్షం వలన దెబ్బతిన్న పంట నష్టంపై మంగళవారం వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించారు. మండలంలోని 8 గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారులచే పంట నష్టం వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏఓ అబ్బూరి శరత్‌బాబు మాట్లాడారు. మండల వ్యాప్తంగా 10,324 ఎకరాలలో పంట నష్టం జరిగిందన్నారు. సిబ్బంది కొరత ఉందని కలెక్టర్ ఆదేశాల మేరకు మరికొందమందిని నియమించి సర్వే త్వరగా పూర్తిచేస్తామన్నారు.



ముదిగొండ: వల్లబిలో నేలవాలిన మొక్కజొన్న పంట సర్వే నంబర్లను సేకరిస్తున్న ఏఈఓ

ముదిగొండ: మండలంలోని యడవల్లి, పండ్రేగుపల్లి, వల్లబి, గంధసిరి, అమ్మపేటలలో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల సర్వేను మంగళవారం వ్యవసాయాధికారిణి రాధతో పాటు ఆయా గ్రామాల్లో ఏఈఓలు పంటనష్టంపై సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతుల భూముల సర్వే నంబర్లతో పాటు వివరాలు సేకరించారు.

ఉచితంగా కంటి పరీక్షలు

సత్తుపల్లిటౌన్: జవహర్‌నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం కంటి వైద్య పరీక్షా శిబిరం నిర్వహించారు. వరంగల్ శరత్ కంటి ఆస్పత్రి సిబ్బంది సాయి పవన్, వంశీలు కంటి పరీక్షలు చేశారు. ఇందులో 25 మందికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురు శస్త్రచికిత్స నిమిత్తం వరంగల్‌కు తీసుకెళ్లారు. ఈ శిబిరంలో ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కేశవరెడ్డి, బద్రుద్దీన్, జిల్లా నాయకులు చెంచిరెడ్డి, బోడేపూడి బాబు, రామిశెట్టి సుబ్బారావు, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లఘు చిత్రం విడుదల



లఘు చిత్రాన్ని విడుదల చేస్తున్న సీఐ మురళి

మధిర: మధిర యువ నటుడు ప్రవీణ్ చిన్నా ప్రధాన పాత్రలో నటించిన సైబర్ తీవ్స్ లఘు చిత్రాన్ని మంగళవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయం సమీపంలో సీఐ ఒడ్డేపల్లి మురళి చేతుల మీదుగా యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాల గురించి మంచి సందేశాన్ని అందించడానికి కృషి చేసిన నటుడు ప్రవీణ్ చిన్నాని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ చిత్రంలో తేజస్వి, భాస్కర్ తదితరులు నటించగా అశోక్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో యువ దర్శకుడు ఏఆర్ సమీర్, ఆర్కే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దోర్నాల రామకృష్ణ, ప్రముఖ ఫొటోగ్రాఫర్ మీరా తదితరులు పాల్గొన్నారు.

కలప దిమ్మెలు వేలం

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించగా వచ్చిన కలపను మంగళవారం వేలం నిర్వహించారు. 72 టేకు దిమ్మెలు, 5 మారిజాత కర్రలను రూ. 1.90 లక్షలకు వేలం వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్యలు తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళ అభినందనీయం..



చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: చిన్నారులు గీసిన చిత్రకళ అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రముఖ చిత్రకారుడు రవివర్మ జయంతి సందర్భంగా ఆర్ట్ ఉపాధ్యాయుడు వీనస్ ఆధ్వర్యంలో విద్యార్థులు గీసిన చిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించి తిలకించారు. విద్యార్థులు గీసిన దేశ నాయకులు, దేవతామూర్తులు, బాబు బొమ్మలు, వాటర్ పెయింటింగ్స్ చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పాఠశాల చిన్నారులు కాగితాలతో తయారు చేసి బొకేలు అబ్బుర పరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యాకోబు, ఎన్‌సీసీ అధికారి షాకీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నేలకొండపల్లి మండలానికి చెందిన భజన బృందం 24 గంటల పాటు హరేరామ హరేకృష్ణ ఏకనామ సంకీర్తన చేశారు. అంతేకాకుండా శ్రీరామ నామ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకలు

తల్లాడ: మండలంలోని పాత పినపాక గ్రామంలో మంగళవారం కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో సీతమ్మ అమ్మ వారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అర్చకులు రాఘవేంద్ర స్వామి, శ్రీ కృష్ణ చరణ్‌లు, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ తలంబ్రాలను కలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామ పంచాయతీ కార్యాయంలో నేడు (బుధవారం) ఉదయం 9.30 గంటల సమయంలో దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం, ఐకేపీ ఏపీఎం శ్యామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు సదరం సర్టిఫికేట్, ఆధార్, కార్డు జిరాక్స్, పాస్‌ఫొటో, రూ.50 తీసుకోని రెబ్బవరం పంచాయతీ కార్యాలయానికి సకాలంలో రావాలని సూచించారు. బస్‌పాస్ పొందిన దివ్యాంగులు ఏడాది మొత్తం 50 శాతం రాయితీతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులలో ప్రయాణాలు సాగించవచ్చని తెలిపారు.

వితరణలు వెల్లువ..

నిరుపేద కుటుంబానికి పీఎస్‌ఆర్ ట్రస్ట్ చేయూత..

సత్తుపల్లి: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లోని నిరుపేద నాగూరుబీ కుటుంబానికి పర్సా సీతారాత్నం ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థపకుడు పర్సా పుల్లయ్య రూ.10వేలు విలువైన గ్రైండర్ మిషన్‌ను మంగళవారం హైస్కూల్ ప్రాంగణంలో అందజేశారు. నాగూరుబీ భర్త ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితం కావడంతో ఇటీవల కొందరు దాతలు హోటల్ నడపడానికి సాయమందించారు. దీంతో వీరికి గ్రైండర్ అవసరమని గ్రహించిన పుల్లయ్య వారికి దానిని అందించారు. ఎన్టీఆర్‌నగర్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు సరోజిని అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఎస్‌ఆర్ ట్రస్ట్ ప్రథమ వార్షిక వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాలో ఎవరైతే ఎక్కువ మార్కులు సాధిస్తారో వారికి ఖమ్మంలో బహుమతులు అందిచడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.5 వేలు విలువైన పరీక్ష ప్యాడ్లు, ఇతర సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ జాన్‌బీ, మున్సిపల్ కౌన్సిలర్ చాంద్‌పాషా, ప్రకాశరావు, జానీ, పాఠశాల ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీటిని ఎంఈఓ నెమ్మకంటి దామోదరప్రసాద్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, ట్రస్టు సభ్యులు మహంకాళి స్వరాజ్య లక్ష్మీ, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుస్తులు..

మధిర: పట్టణంలోని సీపీఎస్ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు మంగళవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ప్రభు దయాళ్ ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, పాదరక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాలు..

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని జవహర్‌నగర్‌లో ఏ ఆధారం లేని వృద్ధులు, దివ్యాంగులకు సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి మంగళవారం బియ్యం, నిత్యావసరాలు వితరణగా అందించి మాట్లాడారు. పరోపకారానికి మించింది ఏదీ లేదని.. వృద్ధులు, దివ్యాంగులను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు.

ఉమ్మినేని సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందిన ఎస్‌కే మౌలాలికి వెన్నుపూస దెబ్బతినడంతో రెండు కాళ్లు పనిచేయడం లేదు. దీంతో ఉమ్మినేని సేవా ఫౌండేషన్ సహకారంతో అతనికి వైద్యం చేయించడంతో పాటు, ఆర్థిక సాయాన్ని మంగళవారం కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు స్వరూప, కల్యాణపు రవి, బుచ్చయ్య, సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి ఎస్సై రామారావు ఔదార్యం..



పాలడబ్బాలు అందజేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రామారావు

కారేపల్లి: చంటిపాపకు పాలడబ్బాలు అందించి కారేపల్లి ఎస్సై రామారావు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పేరుపల్లి గ్రామానికి చెందిన ఏనుగు గౌరమ్మ కుమార్తె ఇటీవల చంటిబిడ్డకు జన్మనిచ్చి అనారోగ్యంతో చనిపోయింది. ఈ క్రమంలో నిరుపేదరాలైన గౌరమ్మ ఆరు నెలల వేదశ్రీకి డబ్బాపాలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై తన సొంత డబ్బులతో రూ.4000 లతో పాల డబ్బాలు కొన్నారు. వీటిని సీఐ నూనె వెంకటేశ్వర్లు చేతుల మీదుగా వారికి అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, పేరుపల్లి సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి..

మండలంలోని పేరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు జ్యోతిర్మయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్యాడ్లు, పెన్నులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బోసు, శ్యాంలాల్ పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

కొణిజర్ల: గడప గడపకూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని మంగాపురంలోని ఓ కల్యాణ మండపంలో 13 పంచాయతీలకు సంబంధించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కవిత, సొసైటీ చైర్మన్ రవి, రైతు బంధు సమితి కన్వీనర్ మాధవరావు, సుడా డైరెక్టర్ కృష్ణయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు దేశానికే ఆదర్శం

కొణిజర్ల: కంటి వెలుగు దేశానికే ఆదర్శమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని తీగలబంజరలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న మహిళకు కళ్ల అద్దాలను అందించారు. వైద్యపరీక్షలు జరుగుతున్న తీరును స్థానిక వైద్యుడు సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రమాదేవి, ఎంపీఓ పి.ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్ఓ మధుసూధన్, జెడ్పీటీసీ కవిత, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు



ఎర్రుపాలెం: కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

నర్సింహాపురంలో..

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామంలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ అరుణ లాంచనంగా ప్రారంభించారు. బనిగండ్లపాడు పీహెచ్‌సీకి చెందిన వైద్యులు పలువురికి వైద్యపరీక్షలు చేసి కళ్ల జోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమాదేవి, సెక్రటరీ ప్రశాంతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సాంబశివరావు, కాశేశ్వరరావు, రమేష్, జనార్దన్‌రెడ్డి, రామకోటారెడ్డి, కృష్ణారావు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరంకుశ సర్కార్‌ను నిలదీద్దాం..



సంకల్ప సత్యాగ్రహ దీక్షలో సంభాని చంద్రశేఖర్, నాయకులు



మధిర: దీక్షలో కాంగ్రెస్ నాయకులు

సత్తుపల్లి/మధిర: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశ చర్యలను సమిష్టిగా నిలదీద్దామని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. రాహుల్ గాంధీపై కక్ష్య సాధింపు చర్యలకు నిరసనగా మంగళవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద 'సంకల్ప సత్యాగ్రహ దీక్ష'ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ కార్యకర్తలు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ బైరెడ్డి మనోహర్‌రెడ్డి, నాయకులు సీతారాములు, శ్రీనివాస్, శివవేణు, సాల్మన్‌రాజు, భూపతిరెడ్డి, సోమిరెడ్డి, అప్పారావు, కృష్ణ, రాంబాబు, హరిప్రసాద్‌రెడ్డి, పెద్దిరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

29న ముగింపు సభను జయప్రదం చేయండి

మధిర: ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన సీపీఎం జన చైతన్య యాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం దెందుకూరులో నిర్వహించిన పలు ప్రజా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరిగిన ధరలకు, కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సభకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అల్లూరి నాగేశ్వరరావు, మధు, గోపి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుంటుంబానికి పొంగులేటి పరామర్శ



మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏన్కూరు: మండలంలోని భగవాన్‌నాయక్ తండలో ఇటివల మృతి చెందిన బానోత్ రామారావు కుటుంబాన్ని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయభాయి, వెంకటేశ్వర్లు, ప్రహ్లాదరావు, నాగేశ్వరావు, శివకుమార్, సత్యనారాయణ, ఆది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫేర్‌వెల్ డే వేడుకలు

పెనుబల్లి: మండలంలోని వియంబంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ డే వేడుకలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మంగళవారం 9 తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ డే ఏర్పాటు చేశారు. సందర్భంగా ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులంతా మంచిగా చదువుకుని పరీక్షలు భాగా రాయాలన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు, ఎంపీటీసీ జాన్సీ, ఎస్‌ఎంసీ చైర్మన్ కృష్ణ, సభ్యులు చంద్రశేఖర్, ప్రసాద్, రాములమ్మ, పుల్లయ్య, నిరంజన్, లింగగూడెం హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు చల్లా వెంకటేశ్వరరావు, రామారావు, వై.శ్రీనివాస్, వనమా నాగేశ్వరరావు, సోమ్లానాయక్, రాజు, ఉమారాణి, పద్మలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఉపాధ్యాయుడు

ఘనంగా పోషణ్ పక్వాడ ప్రదర్శనలు

పలు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, పలు విద్యాలయాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాల ప్రాముఖ్యతను వివరించేదుకు పోషణ్ పక్వాడ కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, చిన్నారులకు, బాలింతలకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ దొడ్డా హైమావతి



వైరారూరల్: చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం